CLCI BIBLE INSTITUTE

Chrstianpet NIDUBROLU

# ధన్యతలు

## THE BEATITUDES



| | |
|---|---|
| Matthew 5:3 | ఆత్మ విషయమై దీనులైనవారు ధన్యులు; పరలోక రాజ్యము వారిది |
| Matthew 5:4 | దు:ఖపడువారు ధన్యులు; వారు ఓదార్చబడుదురు |
| Matthew 5:5 | సాత్వికులు ధన్యులు ; వారు భూలోకమును స్వతంత్రించుకొందురు |
| Matthew 5:6 | నీతి కొరకు ఆకలి దప్పలు గలవారు ధన్యులు ; వారు తృప్తి పరచబడుదురు |
| Matthew 5:7 | కనికరము గల వారు ధన్యులు; వారు కనికరము పొందుదురు |
| Matthew 5:8 | హృదయశుద్ధిగలవారు ధన్యులు; వారు దేవుని చూచెదరు |
| Matthew 5:9 | సమాధాన పరచువారు ధన్యులు; వారు దేవుని కుమారులనబడుదురు |
| Matthew 5:10 | నీతి నిమిత్తము హింసింపబ డు వారు ధన్యులు ; పరలోక రాజ్యము వారిది |


రెవ. డేవిడ్ కీని

**Rev. David Koenig**

## ఖచ్చితమైన వాక్యము (The Very Word)

ప్రభువు కొండమీద ప్రసంగములోని మొదటి భాగమును ధన్యతవాక్యములు అని అందురు. లాటిన్ పదమూలమును బట్టి దీనిని ఇంగ్లీషులో బియాటిట్యూడ్స్ అని అందురు. అయితే మూలభాషయైన గ్రీకులో దీనిని *μακαριον* 'మకారియాన్' అనగా 'ధన్యతలు' అని బహువచన రూపములో పిలిచిరి. ఏకవచనంలో మకారియాస్ అనగా అర్థం ధన్యత లేదా ఆనందము. గ్రీకు భాషలోనే ధన్యత అను అర్థం ఇచ్చు మరియొక పదము కలదు. అది ***Ευλογητος*** యొలగేటాస్. అనగా బాగుగా మాట్లాడుట అని అర్థము. ఈ రెండు పదాలలోని తేడా మనము లూకా 1:68 మరియు ఎఫె 1:3 ద్వారా మనము గమనించవచ్చును. ఈ వాక్యములలో మకారియాస్‌ను ఉపయోగించుట ద్వారా క్రైస్తవ్యము అనునది ధన్యకరము మరియు బాగుగా మాట్లాడగలిగిన స్థిరమైనది అని మనము చూడగలము. మకారియాస్ పదములోని ఆనందము లేదా ధన్యత కేవలము క్రీస్తును అనుసరించుట వలన మాత్రమే కలుగలదు అంతేకాని లోకములో గొప్పగా చెప్పబడుచున్న ఇతర మతములలో లేదు. దీనివలన క్రైస్తవ్యము ఎంత విశిష్టమైనదో మరియు క్రీస్తు లోకమును అందలి మతములను ఏవిధంగా అధిగచించినారో స్పష్టముగా చూడవచ్చును. అంతేకాకుండా ఈ ధన్యత మనకు ఇచ్చుటకు క్రీస్తు ఈ లోకములో మనతో కూడా ఉన్నాడు. మత్తయిలోని ధన్యతవాక్యములకు మరియు లూకా 6:20-22 లోఉన్న భాగమునకు చక్కని పోలిక ఉన్నది.

ప్రతి ధన్యతవాక్యముతో కూడా మనము ఒక ఉదాహరణను తీసుకొని అది మనజీవితాలకు ఏవిధముగా అర్థముగా ఉండి ఫలితాలను ఇచ్చుచున్నదో మనము చూడగలము.

Matthew 5:3 ఆత్మ విషయమై దీనులైనవారు ధన్యులు; పరలోక రాజ్యము వారిది

**Mat 5:3 Blessed are the poor in spirit: for theirs is the kingdom of heaven.**



ప్రభువు బోధించిన అనేక ఉపమానాలలో ఆత్మవిషయంలో బహు దీనముగాఎలా ఉండాలో సుంకరి మరియు పరిసయ్యుడు ఉపమానము మనకు చక్కగా చెప్పుచున్నది. ఈ ఉపమానములో సుంకరి తన కండ్లనుకూడా పైకి ఎత్తలేని తన పాపస్థితిని గుర్తించి తాను ఏమాత్రము దేవునిదయకు పాత్రుడుకాడని గుర్తించినాడు. లూకా 18:9-14. ఆ సుంకరి తాను పాపి అని తెలుసుకొని 'దేవా పాపినైన నన్ను కరుణించుము' అని పలికెను. ఆత్మలో దీనముగా ఉండుట అనగా లోపలి స్థితి ఉన్నదిఉన్నట్లుగా బయటకు వచ్చుట. అయితే వేషధారులు లోపలొకటి మరియు బయట వేరొకటిగా ప్రవర్తిస్తారు. కాని సుంకరి తన హృదయస్థితిని గ్రహించి తాను ప్రజలను ఏవిధంగా మోసంచేసింది మరియు తాను ఎటువంటి పాపుల గుంపులో ఉన్నాడో గ్రహించుకొన్నాడు. తాను దేవుని శిక్షకు పాత్రుడని గ్రహించి ప్రార్థించినాడు. అందువలన దేవుడు ఆశిక్షనుండి సుంకరి తప్పించినాడు. అయితే దేవుడు ఆ శిక్షను సర్వమానవాళికొరకు యేసుకు విధించినాడు.



మరియు సుంకపుదారులవిషయానికి వచ్చినప్పుడు చెట్టు ఎక్కిన ఒక పొట్టి మనుష్యుని గురించి ఆలోచించాటి. జక్కయ్య వాస్తవానికి మోసకారి, ధనవంతుడు మరియు కుయుక్తిపరుడు. కాని అతను యేసును చూడాలని ఆశించాడు. (లూకా 19:1-9) అతడు యేసును చూచే రోజురానే వచ్చింది మరియు అతని ఇంటిలోనికి రక్షణ కూడా వచ్చింది. జక్కయ్య తాను ఆత్మలో దీనముగా ఉన్నాడుగనుకనే చెట్టు ఎక్కుటకు పురికొల్పబడ్డాడు. తనలో యేసుయొక్క అవసరతను గుర్తించినాడు. తన ఆస్తిలో సగం బీదలకు పంచుటకు మరియు ఎవరియొద్దనైన తాను అన్యాయముగా తీసుకొన్నచో దానికి నాలుగంతలు చెల్లిస్తానని జక్కయ్య చెప్పుటలో అతని దీనమైన ఆత్మ కనబడుచున్నది. ధనంకంటే దేవుని రాజ్యమే గొప్పదని గ్రహించినాడు. నశించినదానిన వెదకి రక్షించుటకు మనుష్యకుమారుడు వచ్చాడు. 10వ. నశించబోతున్న జక్కయ్యను యేసు వెదకి రక్షించినాడు.

ఇటువంటి దీనమైన ఆత్మకు మరియొక ఉదాహరణ లూకాలో చెప్పబడిన మరియ మాటలు. లూకా 1:46-48 అప్పుడు మరియ ఇట్లనెను “నా ప్రాణము ప్రభువును ఘనపరచుచున్నది. ఆయన తన దాసురాలి దీనస్థితిని కటాక్షించెను. నాఆత్మ నా రక్షకుడైన దేవునియందు ఆనందించెను.” ప్రభువునకు తల్లిగా ఉండుటకు మరియు కేవలము దేవుని కృపవలననే ఎంపిక చేయబడినది. మనకు మాదిరిగానే మరియకూడా పాపములోనే జన్మించినది. అయితే ఆమె తన హృదయంలో తన పాపస్థితిని గుర్తించగలిగినది. తనకు అర్హతలేక పోయినా ప్రభువుకు తల్లిగా దేవుడు తనను ఎంపిక చేసినందుకు మరియు తనకు ఇచ్చిన గొప్పస్థితికొరకు ఆమె ఎంతో సంతోషించింది. ఆత్మలో దీనంగా ఉన్నవారిని ప్రభువు ఏలాగు హెచ్చిస్తాడో ఇది తెలుపుతుంది. 52 వ.

అన్నిటికంటే ప్రభువు మనకు గొప్ప ఉదాహరణ. ఆయనకు తన తలను కూడా దాచుకొనుటకు ఈ భూమిమీద చోటు దొరకలేదు. శిలువ మరణము పొందునంతగా ఆయన తనను తాను రిక్తునిగా చేసుకొని తగ్గించుకొనెను. దేవుడు దేని కొరకైతే తనను భూమిమీదకు పంపించినాడో దానిని ఖచ్చితముగా చేసి ఈ భూమిమీద మహోన్నతుడైన దేవుని దీన దాసులు ఏవిధంగా ఉండాలో యేసు మనకు తెలియపరచినాడు. తన శక్తిని మహిమనంతా ఒక ప్రక్కన పడవేసినాడు. పరలోక మహిమ సింహాసనాన్ని వదిలివేసి పాపులైన మనుష్యులమధ్య సంచరించినాడు. అటువంటి ప్రభువుయొక్క దీనత్వం మన జీవితాలలో కూడా ప్రకాశించాలని ప్రభువుయొక్క ఉద్దేశ్యమైయున్నది.

అటువంటి దీనమైన ఆత్మతో తమనుతాము తగ్గించుకొన్నవారికి ప్రభువు ఇచ్చు గొప్ప బహుమానం పరలోక రాజ్యం. అయితే అది ఈ భూమిమీద లేదు. ఎందుకనగా దేవుని రాజ్య ఈ లోకసంబంధమైనది కాదు. దీనమైన ఆత్మగలవారే రానైయున్న క్రొత్త ఆకాశము మరియు క్రొత్తభూమిని స్వతంత్రించుకొనగలరు. ‘పాపినైన నన్ను కరుణించమని ఎవరైతే ప్రార్థిస్తారో వారినే దేవుడు యేసును హెచ్చించిన రీతిగానే హెచ్చించి మనకు పరలోక స్వాస్థ్యములను బహుమానములుగా ఇచ్చుటకు సిద్ధంగా ఉన్నాడు.

## Matthew 5:4 దు:ఖిపడువారు ధన్యులు; వారు ఓదార్చబడుదురు

**Mat 5:4 Blessed are they that mourn: for they shall be comforted.**

దైవచిత్తానుసారమైన దు:ఖము రక్షణార్థమైన మారుమనస్సును కలుగజేయును. 2 కొరింథీ 7:10. అనగా మనము మన పాపములన విషయమై దు:ఖపడవలసి యున్నది. ధనం లేదా ఆరోగ్యం లేదా ఇహలోక సంబంధమైనవాటి గురించి కాదు ఈ దు:ఖం. మనం మలను పరిశీలించుకొని మనలో పాపము ద్వారా నల్లబడిన మన హృదయాన్ని చూడాలని అర్థం యిర్మీయా 17:9. అనగా మనకు దేవుని దయ మరియు పాపక్షమాపణ అవసరమైయున్నది. తన ప్రభువును తాను ఎరుగనని చెప్పిన పేతురు భయంకరమైన పాపాన్ని చేశాడు. మనుష్యుల ఎదుట ఆయనను మనము ఎరుగమని చెప్పిన యెడల తండ్రిని మరియు దేవదూతలను కూడా ఎరుగమని చెప్పినట్లే. తాను చేసినతప్పును ఎప్పుడైతే పేతురు గ్రహించాడో ‘అతడు వెలుపలికి వెళ్ళి సంతాపపడి ఏడ్చెను.’ మత్తయి 26:75. మన పాపముల గురించి ఈరీతిగా మనము దు:ఖపడినప్పుడు అది మనకు సంతోషమును ఇచ్చును కారణము ఆ దు:ఖము పాపక్షమాపణను దయచేయున. ప్రభువుద్వారా తిరిగి వాగ్దానము పొందుకొనిన పేతురు ఆయన ద్వారా తాను చేయవలసిన కార్యము నిమిత్తము సిద్ధపర్చబడినాడు. యోహాను 21:15-19. ప్రభువు పేతురుతో మాట్లాడినప్పుడు అతనికి గొప్ప ఓదార్పు తిరిగి వచ్చింది.

ఇదే మన విషయంలో కూడా జరుగుతుంది. ఎంత ఘోరతప్పుచేసినవారినైనా దేవుని వాక్యములోని ఆయన దయగలమాటలు మనలను అత్యద్భుతముగా ఓదార్చగలవు. మనం వినవలసిన మాటలను మనకు వినిపింపచేసేది మన ప్రభువే. రాత్రి వేశ మన హృదయములను దు:ఖముతో నలుగగొట్టిన యెడల ఉదయము సంతోషాన్ని మనము పొందుకొనగలము. కీర్తన 126:5.





ఆయితే మన ప్రభువు దు:ఖపడుటకు ఆయన ఏ పాపము చేయకపోయినను మానవుని పాపము నిమిత్తము ఆయన దు:ఖ పడినాడు. తీర్పు పొందిన యెరూషలెము నిమిత్తమై ఆయన పొందిన దు:ఖమును జ్ఞాపకము చేసుకొనండి. కోడి తన పిల్లలన రెక్కల క్రిందకు చేర్చుకొనునట్లు ప్రభువు యెరూషలేమును చేర్చుకొనవలెనని యున్నాడు కాని అదిప్రభువును తిరస్కరించినది. మత్తయి 23: 37-39. ఆయన పట్టణమునకు సమీపించినప్పుడు దానిని చూచి దాని విషయమై ఏడ్చి 'నీవును ఈ నీ దినమందైనను సమాధానసంబంధమైన సంగతులను తెలిసికొనిన యెడల నీకెంతో మేలు, గాని ఇప్పుడవి నీ కన్నులకు మరుగు చేయబడియున్నది.' లూకా 19:41-42.

ఆయన తప్ప మలను ఈ లోకములో ఓదార్చువారు ఎవరు లేరు. ఓదార్పు కొరకు అనేకులు ఈ లోకములో అనేకవిధములుగా వెదకు చున్నారు గాని ఆది దొరకుచోటను మాత్రము వెదకుటలేదు. చిన్నబిడ్డలవంటి విశ్వాసముతో మాత్రమే ఆయనలోని ఓదార్పును కనుగొన గలము.

Matthew 5:5 సాత్వికులు ధన్యులు ; వారు భూలోకమును స్వతంత్రించుకొందురు

**Mat 5:5 Blessed are the meek: for they shall inherit the earth.**

అవును! చిన్నబిడ్డలవంటి విశ్వాసముతో... "చిన్న బిడ్డవలె దేవుని రాజ్యము నంగీకరింపనివాడు అందులో నెంతమాత్రము ప్రవేశింపడని మీతో నిశ్చయముగా చెప్పుచున్నాను." మార్కు 10:15.



"సాత్వీకము" అను మాటకు లోబడుట మరియు అణకువ అని అర్థము. ఒక చిన్నబిడ్డకు ఏదైన చెప్పినప్పుడు దానిని ఆబిడ్డ వెంటనే నమ్మును. దాని గురించి ఆ బిడ్డ వాదించడు మరియు కొట్లాడడు.

లేదా ఒకసారి బెరయ సంఘమువారిని జ్ఞాపకము చేసుకొందాము. 'వారు ఆసక్తితో వాక్యమును అంగీకరించి అలాగున్నవో లేవో అని ప్రతిదినము లేఖనములను పరిశోధించుచు వచ్చిరి.' అ.కా 17:11. వాదన చేయుటకు మాత్రము వారు వాక్యమును పరిశీలించలేదు. అపో॥ పౌలు బోధించన సంగతులకు వారు ఆశ్చర్యపడి ఎంతో ఆనందించిరి. వాక్యమును స్వీకరించుటకు మనస్పూర్తిగా అంగీకరించడమే సాత్వీకము. కొంతమంది వారి ఆలోచనలకు సరిపోయే బైబిల్ వాక్యములను వెదకుచూ ఉంటారు. అపో. పేతురు చెప్పినట్లు వారు అవసరమైతే వాక్యమును మార్చికూడా చెప్పగలరు.

అన్నిటికంటే మనం గమనించవలసినదేమంటే మన ప్రభువు ఈ లోకములోనికి వచ్చినవిధానమే ఏంతో సాత్వీకమైనది. బాలశిశువుగా మరియ చేతులలో ఒదిగిపోవడమే ఆయన గొప్ప సాత్వీకము. అణకువగలిగిన శిశువుగా ఆయన ఈలోకానికి వచ్చాడు. అంతేకాకుండా ఆయన యెరూషలేములో ప్రవేశించునప్పుడుకూడా మిక్కలి సాత్వీకుడై దీనుడై భారవాహక పశువునైన గాడిదను ఎక్కి లోప పాప ప్రక్షాళనకొసం తన్ను తాను బలిగా సమర్పించుకొన్నాడు.



'భూలోకమును స్వతంత్రించుకొనుట' అనగా ప్రస్తుత భూలోకముఅని కాదు అర్థము. కారణం పేతురు భక్తుడు తన పత్రికలో స్పష్టము గా చెప్పినట్లు ప్రస్తుత భూలోకము అగ్నిలో నాశనము చేయబడనున్నది. 2పేతురు 3:10-13. దు:ఖపడువారు స్వతంత్రించుకొనబోవునది క్రొత్త ఆకాశము మరియు క్రొత్తభూమి కానున్నది. ప్రకటన 21:1-2. ప్రత్యక్షం కాబోవు ఆ అద్భుత క్రొత్త భూమి ముందు మరణ ఛ్ఛాయలతోను కన్నీటితోను నిండిఉన్న ఈ ప్రస్తుత భూమిని స్వతంత్రించుకొనుటకు ఎవరు ఇష్టపడరు. స్వతంత్రించుకొనబోవు నూతన భూమిలో కన్నీరు ఉండదు మరియు మరణము ఉండదు. ప్రకటన 7:15-17.

Matthew 5:6 నీతి కొరకు ఆకలి దప్పులు గలవారు ధన్యులు ; వారు తృప్తి పరచబడుదురు

*Mat 5:6 Blessed are they which do hunger and thirst after righteousness: for they shall be filled.*

మనుష్యులకు ఆకలి మరియు దప్పిక అగుటకు కొంత సమయం పడుతుంది. శారీరక ఆకలి మరియు దప్పిక అగుటకు మనకు ఒక రోజు మరియు కొన్ని గంటల సమయం పడుతుంది. అదేవిధంగా దేవునిలో మనము నీతిగా చేయబడినప్పుడు మనమింకను పాప శరీరములో ఉన్నాము కనుక మనకు కూడా ఆత్మీయ ఆకలి మరియు దప్పిక అగుటకు కొంత సమయం పడుతుంది. ఈ సత్యమును తప్పిపోయిన కుమారుని ఉపమానము మనకు చక్కగా బోధిస్తుంది. లూకా 15:11-32. తప్పిపోయిన కుమారుడు ఆస్తిలో తన భాగమును తీసికొని దానిని దుర్వినియోగం చేసి పందులకంటే హీనంగా జీవించుచున్నప్పుడు అతనికి బుద్ధివచ్చింది. అతడు తన తండ్రియొద్దక వచ్చి 'నేను పరలోకమునకు విరోధముగాను నీయొదుట పాపము చేసితిని' అని చెప్పినప్పుడు ఆ తండ్రి తన కుమారుని తన కౌగిలిలోకి ఆహ్వానించాడు. హృదాయలను స్పందింపజేసే ఈ దృశ్యంచూచినప్పుడు ఆత్మీయ ఆకలిదప్పులు గలవారిని ప్రభువు ఏరీతిగా తృప్తిపరుస్తాడో మనము చూడగలము. క్రీస్తులో క్షమాపణే మనకు కావలసిన అత్యంత ప్రాముఖ్యమైనది.



తానే జీవాహారమని యేసు చెప్పియున్నాడు. యోహాను 6:35. ప్రభువును నమ్ముకొనినందున మనుము దేవుని దయద్వారా యేసుచేత ఆత్మీయముగా పోషించబడుచున్నాము. ప్రభువైన యేసు తాను ఈ భూమిమీద నడిచినప్పుడు దేవునియందు నీతి అనగా ఏమిటో తనజీవితంద్వారా తెలియజేశాడు.  ఆయనయందు ఏపాపములేదు. దీనిద్వారా యేసు మనకు నీతియాయెను. అందువలన మనము పరలోకముగృహంలో అతిపరిశుద్ధ స్థలములో మనకు ప్రవేశం లభించింది. ప్రభువే మనకు నీతియై యున్నాడు. 1 కొరింధీ 1:30. మన పాపములు తండ్రికి కనిపించకుండా కేవలము తన కుమారుని యొక్క నీతిమాత్రమే తండ్రి కి కనిపించునట్లు ప్రభువు మనలను తన నీతి వస్త్రంతో కప్పియున్నాడు.

ఆకలి బాధయేమిటో మనలో ప్రతిఒక్కరికి తెలుసు. ఆకలి అనునది మన శరీరం సహజంగా మనకు ఇచ్చు హెచ్చరికలవంటివి. ఆయతే ఆత్మీయ ఆకలి అనేది సహజమైనది కాదు. కారణం మన పాపశరీరం మనలకు ఆత్మీయ ఆకలి తెలియనివ్వకుండా తన స్వంత నీతితో మనలను తృప్తిపరచుటకు ప్రయత్నిస్తూ ఉంటుంది. అయితే మన నీతి క్రియలన్నియు మురికి గుడ్డలని యెషయ 64:6లో వ్రాయబడినది. మన నీతి క్రియలు మనలను తృప్తిపరచినట్లు కనిపించినా అది తాత్కాలికమైనది మాత్రమే. మరల వెంటనే లేదా కొద్ది దినములలో ఆ ఆత్మీయ ఆకలిబాధ తిరిగి బయటపడుతుంది. ఈ ఆత్మీయ ఆకలి ఎలా తీరుతుంది? మనకు పరలోకంలో స్థానం కల్పించుటకు ప్రభువు మన రక్షణకోసం చేసిన శిలువయాగ సందేశం మాత్రమే మన ఆత్మీయ ఆకలిని తీర్చగలదు. 'ఇందువలన మనము సత్యసంబంధులమని ఎరుగుదుము. దేవుడు మన హృదయముకంటె అధికుడై, సమస్తమును ఎరిగియున్నాడు గనుక మన హృదయము ఏఏ విషయములలో మనయందు దోషారోపణ చేయునో ఆయా విషయములలో ఆయనఎదుట మన హృదయములను సమ్మతి పరచుకొందము.' 1యోహాను 3:19-20. వ్యక్తిగతంగా ప్రతిరోజు మనం వేసుకోవలసిన ప్రశ్న ఏమనగా మనము ఆయన నీతి కొరకు ఆకలిదప్పులు గలిగి జీవిస్తున్నామా లేదా అని.

Matthew 5:7 కనికరము గల వారు ధన్యులు; వారు కనికరము పొందుదురు
**Mat 5:7 Blessed *are* the merciful: for they shall obtain mercy.**



పరిశుద్ధగ్రంథంలో ప్రభువుద్వారా బోధింపబడిన ఉపమానాలలో అత్యధికులు జ్ఞాపకం చేసుకొనేది మంచి సమరయుని ఉపమానము. లూకా 10:25-36. నిజమైన కనికరమంటే ఏమిటో ఈఉపమానము మనకు చక్కగా బోధిస్తుంది. ఇది కేవలము ఇతరులపై జాలిపడుట మాత్రమే కాకుండా వారికొరకు యేదైన ఒకసహాయము చేయుటకు మనలను పురికొల్పేదే కనికరము. లేఖనాలు ద్వారా తాము చేయవలసినది ఏమిటో బాగుగా తెలిసిన లేవియుడు మరియు యాజకుడు చేయలేనిది సమరయుడు చేయగలిగినాడు. దొంగలచేత కొట్టబడిన ఆ మనుష్యునికి సహాయము చేయుటకొరకు సమరయుడు తన ప్రాణాలను సహితము లెక్కజేయలేదు. సమరయుడు అతడికి వెంటనే సహాయము అందించాడు, పూటకూండ్లవాని ఇంటికి తీసుకెళ్ళాడు, అతని అవసరాలకొరకు డబ్బు ఇచ్చాడు, ఇంకా ఎక్కువ ఖర్చుచేసినయెడల అవసరమైతే ఇచ్చెదనని వాగ్దానము చేసినాడు. ప్రభువు మనకువేసే ప్రశ్నఏమంటే, 1యోహాను 3:17, 'ఈలోకపు జీవనోపాధిగలవాడైయుండి, తనసహోదరునికి లేమి కలుగుట చూచియు, అతనియెడల ఎంతమాత్రమును కనికరము చూపనివానియందు దేవుని ప్రేమ ఏలాగు నిలుచును?'

మన ప్రభువు ఈ లోకంలో జీవించినప్పుడు ప్రజలయెడల ఉదయవేళలోను, మధ్యాహ్నవేళలోను మరియు రాత్రివేళయందు కూడా కనికరముంచినాడు. కనికరముతో ప్రజలయెడల ఆయన అనేక కార్యములను తన అనుచరులకే కాకుండా ఇతరులకు కూడా చేసియున్నాడు. అందరిని కనికరముతో స్వస్థపరిచాడు. మత్తయి 8:16, 9:35. అవసరతలలో ఉన్నవారికొరకు ప్రభువు హృదయము కనికరముతో నిండిపోయునది. సువార్తలలో అంతములేని అనేక ఉదాహరణలు ప్రభువుయొక్క కనికరము నిమిత్తమై వ్రాయబడియున్నవి. ఇప్పుడుకూడా ఆయనఅదేరీతిగా ఉన్నాడు. సజీవుడై తిరిగిలేచి అత్యధికంగా హెచ్చింపబడినను ఆయన కనికర ప్రభువుగానే మనకు తోడుగా ఇప్పుడు కూడా ఉన్నాడు. "మన ప్రధానయాజకుడు మన బలహీనతలయందు మనతో సహానుభవము లేనివాడు కాడు గాని, సమస్త విషయములలోను మనవలెనే శోధింపబడినను, ఆయన పాపము లేని వాడుగా ఉండెను. గనుక మనము కనికరింపబడి సమయోచితమైన సహాయము కొరకు కృప పొందునట్లు ధైర్యముతో కృపాసనమునొద్దకు చేరుదము. " హెబ్రీ 4:15-16.

మన పరిసరములలో జరుగువిషయాలగురించి లేఖనాలు మనకు అనేక హెచ్చరికలు ఇచ్చుచున్నది. "గుంటను త్రవ్వువాడే దానిలో పడును రాతిని పొర్లించువానిమీదకి అది తిరిగి వచ్చును." సామెతలు 26:27. నాణెమునకు ఇంకొక ప్రక్కను కూడా మనము గమనించ వలెను. ఇతరులమీద మనం కనికరంచూపినప్పుడు దేవుడు మనమీద కనికరము చూపగలడు. "కావున మనుష్యులు మీకు ఏమి చేయ వలెనని మీరు కోరుదురో ఆలాగుననే మీరును వారికి చేయుడి. ఇది ధర్మశాస్త్రమును ప్రవక్తల ఉపదేశమునై యున్నది." మత్తయి 7:12.

Matthew 5:8 హృదయశుద్ధిగలవారు ధన్యులు; వారు దేవుని చూచెదరు

**Mat 5:8 Blessed are the pure in heart: for they shall see God.**



మన ప్రభువు హృదయ పరిశీలన చేయువాడు. ఆయన కంటి చూపు నుండి తప్పించుకొను నరుడు ఎవరు కూడా లేరు. ఈ అద్భుత శక్తిని ప్రభువు తన భూలోక జీవితంలో కూడా ఉపయోగించినాడు. 'వచ్చి చూడు' అను ఫిలిప్పు మాటల ద్వారా వెలిగించబడిన నతానియేలు లేచి ప్రభువును చూచుటకు వెళ్ళినాడు. "యేసు నతనియేలును తన యొద్దకు వచ్చుట చూచి ఇదిగో యితడు నిజముగా ఇశ్రాయేలీయుడు, ఇతనియందు ఏ కపటమును లేదని అతనిగూర్చి చెప్పెను.". యోహాను 1:47. సర్వము తెలిసిన ఆప్రభువు శిష్యులు ఉండగోరువారు ఎటువంటి మోసము, కపటము మరియు వంచన లేని వారైయుండ వలెను. దీనిని బట్టి మనము ప్రతిదినము మన హృదయము అను ఇంటిని కూడా శుద్ధి చేసుకొనవలసియున్నది. రాత్రి పడకలమీది వెళ్ళబోయేముందు మనము ఖచ్చితముగా ప్రతి విషయమును ప్రభువుముందు ఒప్పుకొనవలనీ యున్నది. దీని ద్వారా ఆయన మనలను శుద్ధిచేసి మనలను క్షమించగలడు. ఏచిన్న చేదునుకూడా మనలోనికి చేరనీయకూడదు. అనుదిన పశ్చాతాపము మరియు ఒప్పుదల ప్రతి క్రైస్తవునికి అవసరమైయున్నది. ప్రభువుకు ప్రార్ధనచేస్తే ఆయన తన ఆత్మద్వారా మలను పరిశుద్ధపర్చగలడు. లేనియెడలన పాపము మనలో పేరుకుపోయి దేవుని దయ నుండి మలను దూరపర్చగలదు.

"అతిక్రమములు దాచి పెట్టువాడు వర్ధిల్లడు వాటిని ఒప్పుకొని విడిచిపెట్టువాడు కనికరము పొందును." సామెతలు 28:13.

కేవలము మనప్రభువుమాత్రమే **పరిశుద్ధుడు**. మనము ఆయనయందు నీతియగుసట్లు ఆయన మనకోసము పాపముగా మారెను. 2 కొరింధీ 5:21. ఆయనలో పాపమున్నదని ఎవడుకూడా చెప్పలేడు మరియు ఆయనను చూచినవారు ఆయన మాటలు వినినవారు ఎవరుకూడా ఆయనలో సత్యములేదని సవాలు చేయలేరు. యోహాను 8:46.

ఆయితే మనగురిచి ఆవిధముగా ఎవరు చెప్పలేరు. అందువలననే ఆయన ఈ లోకములోని మనకొరకు వచ్చినాడు. ఆయన ద్వారా మనము దేవుని ముఖాముఖిగా చూడబోయే ఆనంద సమయము కొరకు ఎదురుచూద్దాము. అంతకంటే మనకు ఇంకేమి అవసరం లేదు, అక్కర్లేదు. ఆయన తన పరిపూర్ణప్రేమతో మనలను నడిపించువాడు. 1యోహాను 4:18.

Matthew 5:9 సమాధాన పరచువారు ధన్యులు; వారు దేవుని కుమారులనబడుదురు

*Mat 5:9 Blessed are the peacemakers: for they shall be called the children of God.*



యేసేపు తన తండ్రిని తన సహోదరులను ఐగుప్తునకు ఆహ్వానించినది వారికి సమాధనం కలిగించు ఉద్దేశ్యంతో మాత్రమే. ఆది.కా 46-47. తన సహోదరులు తనకు ఎంతో ద్రోహంచేసినా వారిపై ఏమాత్రము పగను చూపక వారిని ప్రేమించి వారితో సమాధనపడుటకు యేసేపు ఆశించినాడు. మన శత్రువులయెడల మన వైఖరిఏలా ఉండాలో ఇది మనక ఒక చక్కని పాఠం గాను యేసు ప్రేమకు సూచనగాను ఉన్నది. "..మీరు పరలోకమందున్న మీతండ్రికి కుమారులైయుండునట్లు మీ శత్రువులను ప్రేమించుడి, మిమ్మును హింసించు వారికొరకు ప్రార్ధన చేయుడి." మత్తయి 5:44-45.

యాకోబుకూడా తన సహోదరుడైన ఏశావును సరైనరీతిగా గౌరవించలేదు పైగా మోసంచేశాడు. అందువలన కొన్న సంవత్సరాల తరువాత ఏశావు యాకోబుపై ప్రతీకారం తీర్చుకొన ఉద్దేశించినాడు. అయితే తన పాపమును గుర్తించి హృదయంలో అన్నతో సమాధానపడగోరిన యాకోబు దేవుని కృపకొరకు ప్రార్ధించగా మధుర ప్రేమగలిగిన దేవుడు వారికలయకను ఎంతో మధురమైన సమాధానకరంగా మార్చినాడు. ',,,,,,.నీవు నీ సేవకునికి చేసిన సమస్తమైన ఉపకారములకును సమస్త సత్యమునకును అపాత్రుడను, ఎట్లనగా నాచేతి కఱ్ఱతో మాత్రమే ఈ యొర్దాను దాటితిని, ఇప్పుడు నేను రెండు గుంపులైతిని." ఆది.కా 32:10. యాకోబు తన అన్నతో సమాధానపడగోరి వచ్చినప్పుడు దేవుడు ఆ దృశ్యమును ఎంతో అద్భుతముగా మార్చినాడు. ఆది.కా 33: 4-11. ఇంతకుముందు తనఅన్నను మోసం చేసిన కారణాన తన ఆస్తిలో ఒక భాగాన్ని అన్నకు కానుకగా ఇచ్చితన సమాధానాన్ని ధృడపరచుకొనినాడు.



మన ప్రభువైన యేసు సమాధానకర్తగా ఈ లోకమునకు వచ్చి పరిశుద్ధదేవునికి పాపియైన మానవునికి మధ్య సమాధానమును ఏర్పరచినాడు. మరియు ఇప్పుడు ఆయన గొప్ప విమోచకునిగా మరియు మధ్యవర్తిగా ఉండి తన ఆత్మద్వారా సంఘమును ఐక్యపరుస్తూ లోకం ఇవ్వలేని శాంతిని మానవ హృదయాలకు అందిస్తున్నాడు. ప్రభువే శాంతిదూతగా ఉండి సమాధాన వాక్యమును మనకు అప్పగిస్తున్నాడు. 2 కొరింథీ 5:18-21. ఆయనే శాంతిని అందిచు షీలోహుగా ఉన్నాడు. ఆది.కా 49:10. ఆయన తన కిష్టులైన మనుష్యుల హృదయాలలో సమాధానము నింపుటకు వచ్చియున్నాడని బెత్లెహేము పొలములో పరలోక సైన్యసమూహము ప్రకటించిరి.

ఈ సమాధాన వాక్యము ఎంత ప్రాముఖ్యమైనదంటే మనమీద మన సహోదరునికి విరోధమేమైనా కలదని మనకు జ్ఞాపకము వచ్చినయెడల అక్కడ బలిపీఠము ఎదుటనే మనయర్పణను విడిచిపెట్టి మొదటవెళ్ళి ఆ సహోదరునితో సమాధానపడవలెను అటు తర్వాత ప్రశాంతమైన కృతజ్ఞత గల హృదయముతో వచ్చి మన యర్పణమును దేవునికి అర్పింపవలెను. ఇదే దేవుని బిడ్డలు చేయవలసిన క్రమమని వాక్యములో ఉన్నది కనుక మనము కూడా అదే చేయవలసియున్నది. మత్తయి 5:24.

Matthew 5:10 నీతి నిమిత్తము హింసింపబ డు వారు ధన్యులు ; పరలోక రాజ్యము వారిది

*Mat 5:10 Blessed are they which are persecuted for righteousness' sake: for theirs is the kingdom of heaven.*

దేవుని నీతి ప్రజలకు వచ్చువిధముగా వారు వినవలసిన మాటలనే స్తెఫను పలికాడు. అయితే వారు మురికి గుడ్డలవంటి తన నీతి విడిచిపెట్టక స్తెఫనును రాళ్ళతో కొట్టి తమకు అడ్డులేకుండా చేసుకున్నారు. అ.కా 7 అధ్యా.



మన ప్రభువు తన శత్రువులైన వారి గురించిచేసిన ప్రార్థనలాంటిదే స్తెఫనుకూడా పలికాడు. "ప్రభువా! వారిమీద ఈ పాపము మోపకుము." అ.కా 7:60. "యేసు తండ్రీ వీరేమి చేయుచున్నారో వీరెరుగరు గనుక వీరిని క్షమించుము అని చెప్పెను." లూకా 23:34. వారు చివరకు యేసును శిలువ వేసినప్పటికి వారి క్షేమంగురించి ప్రార్థించుట యేసుకు ఇదే మొదటిసారి కాదు. ఆయన పెరిగిన నజరేతులోకూడా యేసును రాళ్ళతో కొట్టిచంపుటకు ప్రయత్నంజరిగింది. లూకా4:29. తరువాత మరల వారు ఆయనకు వ్యతిరేకంగా అభ్యంతరపడిరి. మార్కు 6:3. యేసును నాశనము చేయజూచు వారి సంఖ్య యెరుషలేము లోని ప్రధాన యాజకులలోను శాస్త్రులలోను ప్రజలలోను అంతకంతకు పెరుగుచూ వారిలో పనిచేయుచున్న సాతాను ప్రేరణ ద్వారా చివరకు యేసును శిలువ వేసినారు. చివరి పరిశుద్ధవారములో ఆయనను నాశనము చేయుటకు వారు పధకము పన్నినారు (లూకా 19:47) చివరకు వారు అదేపని చేశారు. కాని వారు చేసిన ఆకీడులోనుండే మేలుకరంగా ఆయన పునరుత్థానుడిగా తిరిగిలేచి తన శత్రువులైన వారికొరకు మరియు సర్వలోపమానవులకొరకు పాపక్షమాపణను గెలిచాడు.

ప్రస్తుత కాలములో కూడా నీతినిమిత్తము మనము కూడా ఇదేవిధముగా హింసను భరింపవలసిరావచ్చును. అయితే ఈ అంత్యకాలములో విశ్వాసులకు వ్యతిరేకంగా హింస ప్రబలినప్పుడు నీతి నిమిత్తము దానిని ఎదుర్కొనుటకు తీవ్రమైన సిద్ధపాటు కలిగి ఉండాలి.

***నానిమిత్తము జనులుమిమ్మును నిందించి హింసించి మీమీద అబద్ధముగా చెడ్డమాటలెల్ల పలుకునప్పుడు మీరు ధన్యులు సంతోషించి ఆనందించుడి, పరలోకమందు మీ ఫలము అధికమగును. ఈలాగున వారు మీకు పూర్వమందుండిన ప్రవక్తలను హింసించిరి. మత్తయి 5:11-12.***



వచనము 10యొక్క కొనసాగింపైన 11,12 వచనాలు మనకు రూపాంతర కొండమీద ప్రభువుతో ఉన్న ఇద్దరు పాతనిబంధన కాలపు మనుష్యులను గుర్తు చేయుచున్నవి. ఇశ్రాయేలీయులు పదేపదే మోషెమీద సణుగుచు ఆయన మీద తిరుగుబాటు చేసినప్పుడు దానిని మోషే ఆ హింసను ఎదుర్కొనవలసివచ్చినది. ఐగుప్తు మాంసపు కుండలయొద్దకు తిరిగి వెళ్ళుటకు సిద్ధమైన ప్రజలు మోషేను చంపుటకు కూడా వెనుకాడలేదుదు. అదేవిధంగా ఏలియా రాజైన ఆహాబు మరియు అతని చెడ్డరాణిని ఎదరించినప్పుడు అతడు హింసను ఎదుర్కొనవలసివచ్చినది. తాను ఒక్కడే దేవుని కొరకు ఉన్న ప్రజలలో తాను మాత్రమే మిగిలిఉన్నానని ఏలియా మిక్కిలిభయపడిపోయెను. మరల మరల ఏలియా యొక్కజీవితమును ప్రమాదములు వెంటాడినవి. ఆయితే నీతి నిమిత్తము హింస భరించిన వారు ఇద్దరు ఇప్పుడు పరలోకములో ఆయన సన్నిధిలో ఉండి ఆయన యొక్క నిత్యానందమును అనుభవించుచుండిరి.

11 మరియు 12 వచనములు గమనించినట్లయిన సంతోషించండి ఆనందించడి పరలోకమందు మీ ఫలము అధికమగునని దేవుని వాగ్దానము అక్కడ ఉన్నది. ఈ జీవితములో దేవుని అనుసరించు మనలకు ఎంతో ఆదరణను కలిగించుచున్నది. ఈ ధన్యత వాక్యములు మనలకు ఎంతో ధైర్యమును సంతోషమును మరి ముఖ్యముగా ఈ అంత్యదినాలలో మనకు అందించు చున్నవి గనుక మనము మన జీవిత పర్యంతము ఆయనను ఆనుసరించుదము.

దేవుని ఆజ్ఞలను మీరువారికి ప్రకటన గ్రంధములో భయంకరమైన దేవుని తీర్పులగురించి వ్రాయబడినవి. అవిమనకు ఒక హెచ్చరికగా ఉన్నవి. దానిని నుండి ఎవరుకూడా తప్పించుకొనలేరు. అయితే ఆ భయంకరమైన తీర్పుల మధ్య తన బిడ్డలైన విశ్వాసులకొరకు ఆయన సంతోషము కలిగించు ఏడు ధన్యతవాక్యములను ఇచ్చియున్నాడు.

***Rev 1:3*** సమయము సమీపించినది గనుక ఈ ప్రవచనవాక్యములు చదువువాడును, వాటిని విని యిందులో వ్రాయబడిన సంగతులను గైకొనువారును ధన్యులు.

***Rev 14:13*** అంతట ఇప్పటినుండి ప్రభువునందు మృతినొందు మృతులు ధన్యులని వ్రాయుమని పరలోకమునుండి యొక స్వరము చెప్పగా వింటిని. నిజమే; వారు తమ ప్రయాసములు మాని విశ్రాంతి పొందుదురు

***Rev 16:16*** ఇదిగో నేను దొంగవలె వచ్చుచున్నాను; తాను దిగంబరుడుగా సంచరించుచున్నందున జనులు తన దిసమొలను చూతురేమో అని మెలకువగా ఉండి తన వస్త్రము కాపాడు కొనువాడు ధన్యుడు.

***Rev 19:9*** మరియు అతడు నాతో ఈలాగు చెప్పెనుగొఱ్ఱపిల్ల పెండ్లివిందుకు పిలువబడిన వారు ధన్యులని వ్రాయుము; మరియు ఈ మాటలు దేవుని యథార్థ మైన మాటలని నాతో చెప్పెను.

***Rev 20:6*** ఈ మొదటి పునరుత్థాన ములో పాలుగలవారు ధన్యులును పరిశుద్ధులునై యుందురు. ఇట్టివారిమీద రెండవ మరణమునకు అధికారములేదు; వీరు దేవునికిని క్రీస్తుకును యాజకులై క్రీస్తుతోకూడ వెయ్యి సంవత్సరములు రాజ్యము చేయుదురు.

***Rev 22:7*** ఇదిగో నేను త్వరగా వచ్చుచున్నాను, ఈ గ్రంథములోని ప్రవచనవాక్యములను గైకొనువాడు ధన్యుడు.

***Rev 22:14*** జీవ వృక్షమునకు హక్కుగలవారై, గుమ్మములగుండ ఆ పట్టణము లోనికి ప్రవేశించునట్లు తమ వస్త్రములను ఉదుకుకొనువారు ధన్యులు.







అప్పుడు జనులు మిమ్మును శ్రమల పాలుచేసి చంపెదరు;

***Then they will deliver you up to tribulation,***



మీరు నా నామము నిమిత్తము

***And put you to death;***








సకల జనములచేత ద్వేషింపబడుదురు.

***You will be hated by all nations for My name's sake.***







**Mat 24:9** అప్పుడు జనులు మిమ్మును శ్రమల పాలుచేసి చంపెదరు; మీరు నా నామము నిమిత్తము సకల జనములచేత ద్వేషింపబడుదురు.

**Mat 24:10** అనేకులు అభ్యంతరపడి, యొకనినొకడు అప్పగించి యొకనినొకడు ద్వేషింతురు.

**Mat 24:11** అనేకులైన అబద్ధ ప్రవక్తలు వచ్చి పలువురిని మోసపరచెదరు;

**Mat 24:12** అక్రమము విస్తరించుటచేత అనేకుల ప్రేమ చల్లారును.

**Mat 24:13** అంతమువరకు సహించినవా డెవడో వాడే రక్షింపబడును.